ఆరోగ్య సురక్షతో ఇంటింటి సౌభాగ్యం



వైద్య పరీక్షలు చేస్తున్న స్పెషలిస్ట్ వైద్యులు



వైద్య పరీక్షల కోసం క్యూలో వేచి ఉన్న లబ్ధిదారులు

- వైద్య శిబిరాలకు విశేష స్పందన
- అధిక సంఖ్యలో వైద్య సేవలు వినియోగించుకున్న ప్రజలు
- మెరుగైన వైద్య సేవలకు పలువురికి సిఫార్సు



వృద్ధురాలికి కళ్లజోడు అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి తూర్పు నియోజకవర్గ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జోన్-3 పరిధిలోని 17, 18, 19 వార్డుల ప్రజల సౌకర్యార్థం శుక్రవారం ఎంవీపీ కాలనీ అప్పుఘర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్ట్ డాక్టర్ల సమక్షంలో అన్ని రకాల అనారోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 18వ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, వార్డు సీనియర్ నాయకుడు పుక్కళ్ల శంకర్, 19వ వార్డు సీనియర్ నాయకుడు సూరాడ దాసు, 17వ వార్డు సీనియర్ నాయకుడు గేదెల నాగరాజు, జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజారోగ్యం కోసం అందుబాటులోకి తెచ్చిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు.

479 మందికి సేవలు

ఈ శిబిరంలో 479 మందికి వైద్య సేవలు అందించినట్లు వైద్య అధికారి లక్ష్మి తెలిపారు. 11 మందిని మెరుగైన వైద్య సేవల నిమిత్తం సిఫార్స్ చేశామన్నారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 18వ వార్డు అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ, పలువురు సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

10వ వార్డులో..

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు వివేకానందనగర్ యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు రక్త పరీక్షలు, బీపీ, మధుమేహం, టీబీ తదితర పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేస్తున్న పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి ప్రారంభించిన ఈ శిబిరంలో ఆదర్శనగర్, సుందర్‌నగర్, వివేకానందనగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 560 మందికి వైద్య పరీక్షలు చేశామని యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాహిత్య తెలిపారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.



10వ వార్డు వివేకానందనగర్‌లో పౌష్టికాహారం గురించి వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మెరుగైన పరీక్షలకు సిఫార్స్ చేశారు..



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా అందిస్తున్న వైద్య సేవలు బాగున్నాయి. వైద్యులు ప్రత్యేక శ్రద్ధ వహించి పరీక్షలు నిర్వహించారు. అనారోగ్య సమస్యలు తెలుసు కున్నారు. నాకు చూపు సరిగ్గా కనిపించకపోవడంతో శిబిరంలో వైద్యులు పరీక్షించి సర్జరీ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. మెరుగైన పరీక్షలకు సిఫార్స్ చేశారు.

– బొమ్మిడి పెంటయ్య, జాలరిపేట

పరీక్షించి.. మందులు అందజేశారు..



తలనొప్పి, బీపీ, షుగర్, కంటి చూపు, వంటి సమస్యల కారణంగా ఈ శిబిరానికి వచ్చాను. స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షించి మందులు అందజేశారు. త్వరలోనే నా చూపు సమస్యకు అనుగుణంగా కళ్లద్దాలు అందజేస్తామని చెప్పారు. శిబిరం ద్వారా అందిస్తున్న సేవలు బాగున్నాయి.

– రుఖ్సీ, అప్పుఘర్

క్లుప్తంగా

డ్రైడే ఫ్రైడేతో డెంగ్యూ నివారణ



శివాజీపాలెంలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న సబ్ యూనిట్ అధికారి నగేష్

మద్దిలపాలెం : ఫ్రైడే డ్రైడేను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారానే మలేరియా, డెంగ్యూ కట్టడి సాధ్యమవుతుందని జిల్లా మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ తెలిపారు. జీవీఎంసీ 22వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. దీనిలో భాగంగా శివాజీపాలెంలో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. అలాగే 23వ వార్డు మద్దిలపాలెంలో ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ కేసులు నమోదవుతున్న తరుణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంటి పరిసరాల్లో నీటి నిల్వల తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కుమార్, రత్నం, మలేరియా సిబ్బంది. కె.వేణు, గణేష్, కె.ఎస్.ఎన్.రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నడక పోటీలు



బహుమతులు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

ఏయూ క్యాంపస్: శివాజీ పార్క్ గొడుగు వాకర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం నడక పోటీలు నిర్వహించారు. ఆల్వార్‌దాస్ 94వ జయంతి ఉత్సవాలలో భాగంగా జరిగిన ఈ పోటీల్లో 50 మంది పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురు విజేతలుగా నిలిచారు. బాలికల్లో మహాలక్ష్మి ప్రథమ, మౌనిక ద్వితీయ, యశోద తృతీయ బహుమతి సాధించారు. బాలుర విభాగంలో గణేష్ ప్రథమ, సాయి విఘ్నేష్ ద్వితీయ, కిషోర్ తృతీయ స్థానంలో నిలిచి సత్తాచాటారు. 101 డిస్ట్రిక్ట్ గవర్నర్ యు.శోభ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు, కె.శివరామకృష్ణ, కార్యదర్శి వి.సత్యనారాయణ, ఆచార్య వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఆచార్య ఎస్.రామకృష్ణ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ కళాకారులను గౌరవించాలి

బీచ్ రోడ్డు: ఆలయాల్లో ఉదయం నుంచి ఎంతో సేవ చేస్తున్న నాయీ బ్రాహ్మణులను భక్తులు గౌరవించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ కోరారు. ఈ మేరకు నాయీ బ్రాహ్మణ సంగీత కళాకారులను గౌరవించే కార్యక్రమానికి శుక్రవారం ఆయన శ్రీకారం చుట్టారు. దసరా నుంచి తెలుగు రాష్ట్రాల్లోని దేవాలయాల్లో సంగీత కళాకారులను ప్రతి ఒక్కరూ గౌరవించి దక్షిణ అందజేయాలని కోరారు.

హోంగార్డు నిజాయితీ



బ్యాగ్‌ను అప్పగిస్తున్న హోంగార్డు వీరాచారి

బీచ్ రోడ్డు: హోంగార్డు తనకు దొరికిన బ్యాగ్‌ను పోలీసు స్టేషన్‌కు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న కుప్పిలి వీరాచారికి మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో బంగారంతో ఉన్న ఒక బ్యాగ్ శుక్రవారం దొరికింది. ఆ బ్యాగ్‌ను మూడో పట్టణ పోలీసులకు అప్పగించారు. విచారణ జరిపి ఆ బ్యాగ్‌ను బాధితులకు అందజేయాలని కోరారు. నిజాయితీగా బ్యాగ్‌ను పోలీసు స్టేషన్‌కు అప్పగించిన హోంగార్డును అందరూ అభినందించారు.

పెయింటింగ్ పోటీల్లో గురుకులం విద్యార్థుల ప్రతిభ

ఆరిలోవ: పూణేలోని కళాభారతి చైల్డ్ ఆర్ట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గురుకులం విద్యార్థులకు ఇటీవల జాతీయ స్థాయి ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులు ప్రతిభ కనకబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ఆర్ట్స్ అండ్ డ్రాయింగ్ ఉపాధ్యాయుడిని శుక్రవారం గురుకులాల జిల్లా సమన్వయాధికారి శంబాన రూపావతి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ పోటీల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 65 మంది గురుకులం విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వారు వేసిన పెయింటింగ్స్‌ను ఆన్‌లైన్‌లో కళాభారతి చైల్డ్ ఆర్ట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపించామని తెలిపారు. ఏడో తరగతి విద్యార్థి విజయ్, ఎనిమిదో తరగతి విద్యార్థి స్టీవెన్‌సన్, తొమ్మిదో తరగతి విద్యార్థి లోకేష్, పదో తరగతి విద్యార్థి రాజ్‌కుమార్ ప్రతిభ కనబరిచి, కళా గౌరవ పురస్కారం దక్కించుకున్నారు. మిగతా 61 మంది విద్యార్థులకు ప్రోత్సాహక సర్టిఫికెట్లు లభించాయి. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఆర్ట్స్ ఉపాధ్యాయుడు పి.సుధాకర్‌కు కళా భూషణ్ అవార్డు లభించిందన్నారు.



గురుకులంలో విద్యార్థులు, డ్రాయింగ్ ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న డీసీ రూపావతి

నిత్యం ట్రాఫిక్ నిబంధనల హెచ్చరికలు



అనౌన్స్ స్పీకర్‌ను ఏర్పాటు చేస్తున్న ఎస్‌ఐ కనకరాజు

మద్దిలపాలెం : ట్రాఫిక్ నిబంధనల హెచ్చరికలు ఎప్పటికప్పుడు వాహనచోదకులకు తెలిసేలా మద్దిలపాలెం ప్రధాన సిగ్నల్ కూడలిలో అనౌన్స్ స్పీకర్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని ట్రాఫిక్ ఎస్‌ఐ కనకరాజు శుక్రవారం అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు నిత్యం తెలియజేయనున్నామన్నారు. హెల్మెట్, కారు సీటు బెల్ట్ పెట్టుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌ఐ తిరుపతిరావు, సిబ్బంది బొత్స వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

తోపుడుబండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులివ్వాలి

మద్దిలపాలెం : చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. చిరు వ్యాపారులతో శుక్రవారం పితాపురం కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో హ్యాకర్ల జోన్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలన్నారు. జీవీఎంసీ అధికారులు నిరంతరం చిరు వ్యాపారులపై దాడులు చేస్తూ జీవనోపాధికి భంగం కలిగిస్తున్నారన్నారు. వెంటనే హ్యాకర్ల జోన్‌లు ఏర్పాటు చేస్తే ఈ సమస్య పునారావృతం కాదన్నారు. దీనిపై ఈనెల 20వ తేదీ నుంచి నవంబర్ 3వ తేదీ వరకూ నిరసన కార్యక్రమాలు చేపటనున్నామన్నారు. నవంబర్ 15న చలో జీవీఎంసీ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చిరువ్యాపారుల ప్రతినిధులు సింహాచలం, పి.వెంకటరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్

460 గ్రాముల శిశువుకు అరుదైన వైద్యం



తల్లిబిడ్డలతో మెడికవర్ వైద్యుల బృందం

ఎంవీపీ కాలనీ: 460 గ్రాముల బరువుతో జన్మించిన శిశువుకు ఎంవీపీ కాలనీ మెడికవర్ ఆస్పత్రి వైద్యులు అరుదైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు. ఆస్పత్రి వర్గాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖకు చెందిన స్రవంతి అనే మహిళ ముందస్తు ప్రసవం కారణంగా దేశంలోనే అతి తక్కువ బరువుతో ఉన్న శిశువు(460 గ్రాములు)కు జన్మనిచ్చింది. దీంతో ఆ శిశువును సంరక్షించేందుకు మెడికవర్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ సునీల్ కిషోర్(చీఫ్ కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్), డాక్టర్ గీతావందన(గైనకాలజిస్ట్), డాక్టర్ విజయ్, డాక్టర్ మౌనిక, డాక్టర్ జగదీష్‌తో కూడిన బృందం కృషి చేసింది. 460 గ్రాముల బరువుతో జన్మించిన శిశువు మనుగడ అవకాశాలు చాలా తక్కువ. ఈ నేపథ్యంలో ఈ బృందం ఆధునిక సాంకేతికతను వినియోగించి శిశువును సురక్షితంగా కాపాడింది. ఊపిరితిత్తులతో పాటు ఇతర అవయవాలు క్రియాత్మకంగా చాలా అపరిపక్వంగా ఉండడంతో కఠినమైన పరిస్థితులను ఎదుర్కొంటూ వైద్యం అందించారు. 30 రోజుల పాటు ఇన్వాసివ్ వెంటిలేషన్, 40 రోజుల పాటు నాన్ ఇన్వాసివ్ వెంటిలేషన్‌లో ఉంచి సంరక్షించారు. దీంతో పాటు ఊపిరితిత్తుల పెరుగుదలకు సర్ఫ్యాక్టెంట్ ఇంజక్షన్‌ను 4 సార్లు ఇచ్చినట్లు వైద్యులు తెలిపారు. ఇన్ఫెక్షన్‌లు వచ్చే పరిస్థితి ఉండడంతో తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఇలా ఈ వైద్య బృందం పర్యవేక్షణలో శిశువు పూర్తిగా కోలుకున్నాడు. 2.6 కేజీల బరువుకు పెరిగాడు. అనంతరం ఇటీవల సంపూర్ణ ఆరోగ్యంతో శిశువును డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మెడికవర్ ఎంవీపీ కాలనీ హెడ్ శ్యామలతో యాజమాన్య ప్రతినిధులు, ఇతర వైద్యులు ఈ వైద్య బృందాన్ని అభినందించారు.

చోరీ కేసులో వేలిముద్రల పరిశీలన

సీతమ్మధార: మారుతీనగర్‌లో జరిగిన భారీ చోరీ కేసులో క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. ఈ ఘటనపై ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు పాత నేరస్తుల వేలిముద్రలు పరిశీలిస్తున్నారు. మూడు రోజుల కిందట బాలయ్యశాస్త్రి లేఅవుట్ మారుతీనగర్‌లోని ఎంవీపీ సత్య హోమ్స్‌లో వజ్రాల ఆభరణాల చోరీ జరిగిన విషయం తెలిసిందే. పోలీసులు ఇప్పటికే గతంలో అక్కడ పనిచేసిన వర్కర్లు, వాచ్‌మెన్లను విచారించా రు. అపార్ట్‌మెంట్ వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో నేరస్తులను పట్టుకోవడం పోలీసులకు కష్టతరంగా మారింది. పది రోజుల కిందట విజయవాడకు చెందిన శ్రీనివాసరెడ్డి డైమండ్ పార్కు వద్ద తన కారు పార్క్‌చేసి కుటుంబ సభ్యులతో కలిసి సాయిరాం హోటల్‌లో టిఫిన్‌కు వెళ్లి తిరిగి వచ్చేసరికి కారు అద్దాలు పగలగొట్టి బంగారు నగలు దొంగలించారు. దీనిపై కూడా ఇంతవరకు పోలీసులకు స్పష్టత రాలేదు.

ఏయూ సమాచారం

విశ్రాంతి గదుల ఆధునికీకరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగంలో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని విశ్రాంతి గదులను పూర్తి స్థాయిలో ఆధునికీకరించారు. శుక్రవారం వాటిని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సమక్షంలో విద్యార్థులతో ప్రారంభింపజేశారు. దాదాపు రూ.15 లక్షల నిధులతో వీటిని ఆధునికీకరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రెస్ట్‌రూమ్‌లను ప్రారంభిస్తున్న విద్యార్థులు

ఘనంగా 'నా దేశం-నా మట్టి'

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నా దేశం-నా మట్టి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ సేవా పథకం విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రారంభించారు. వర్సిటీ నుంచి సేకరించిన మట్టిని విద్యార్థుల సమక్షంలో అమృత కలశంలో వేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువతలో సమైక్య భావన, దేశ భక్తిని పెంచే విధంగా ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఎంతో పవిత్ర భావంతో జాతీయ సేవా పథకం యూనిట్ల నుంచి వివిధ ప్రాంతాల నుంచి మట్టిని సేకరించి, దేశ రాజధానికి పంపుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ శైలజ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



కలశంలో మట్టి పోస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

బహుభాషా కోవిదుడు జోస్యుల సూర్యప్రకాశరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగంలో ఆచార్య జోస్యుల సూర్యప్రకాశరావు సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సీనియర్ ఆచార్యులు జి.యోహాన్‌బాబు మాట్లాడుతూ ఆచార్య జోస్యుల సూర్యప్రకాశరావు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి వార్డెన్‌గా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్‌గా పని చేసి గుర్తింపు పొందారన్నారు. జోస్యుల బహుభాషాకోవిదులని, దాదాపు 12 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలరన్నారు. సంస్కృతం, తెలుగు భాషలతో పాటు హిందీ లోను సాధికారంగా పట్టు సాధించిన జోస్యుల మంచి సాహిత్యాన్ని సృష్టించారన్నారు. నవ సాహితి ఇంటర్నేషనల్ చెన్నై సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ గురువులను స్మరించుకోవడం వారి మీద ఉన్న గౌరవాన్ని తెలియజేస్తుందన్నారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో తెలుగు ఆచార్యులు డాక్టర్ సీతారత్నం, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ బి.వెంకటస్వామి, డాక్టర్ కె.రత్నశేఖర్, డాక్టర్ పి.లావణ్య, ఎ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



జోస్యుల చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఆచార్యులు

ప్రకృతి వనం సందర్శన



మొక్కలను తిలకిస్తున్న విద్యార్థులు



పుష్పాలతో ఎడారి మొక్క

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని జీవవైవిధ్య ఉద్యాన వనాన్ని నగరంలోని ప్రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పార్క్ విశేషాలను పార్క్ నిర్వాహకులు డాక్టర్ మంథా రామమూర్తి వివరించారు. పార్క్‌లోని వైవిధ్యత కలిగిన మొక్కలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

వికసించిన ఎడారి మొక్క

పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎడారి సంరక్షణాలయంలోని కారల్లుమా క్రెనులాటా మొక్క పుష్పాలతో కనువిందు చేస్తోంది. ఎర్రని నక్షత్రం పువ్వులతో ఎంతో ఆకట్టుకుంటోంది.


బాలల సమస్యలపై అధ్యయనం చేయండి

ఏయూ క్యాంపస్: బాలల సమస్యలపై ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధన నిర్వహించి, ఒక సమగ్ర నివేదిక ఇవ్వాలని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం వీసీని ఆయన తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేసలి అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కొంత మంది యువత మత్తు పదార్థాలు వినియోగంతో పాటు వ్యాపారం, రవాణా చేస్తున్నట్టు కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని కోరారు. దీనిపై వీసీ సానుకూలంగా స్పందించి సంబంధిత శాఖాధిపతులకు ఆదేశాలు జారీ చేశారు.



వీసీ ప్రసాదరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కేసలి అప్పారావు

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



పూజలందుకున్న దుర్గాదేవి

మద్దిలపాలెం : హెచ్‌బీ కాలనీ సంజయ్ గాంధీ కాలనీలో దుర్గాదేవి ఆలయంలో ఆదివారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 24వ తేదీ వరకూ జరగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు.



ఇసుకతోట రావిచెట్టు విజయదుర్గా మందిరం వద్ద రాట మహోత్సవం

ఇసుకతోటలో పందిరి రాట

ఇసుకతోటలోని రావిచెట్టు విజయ దుర్గా మందిరంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పందిరి రాట వేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి అమ్మవారి ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని విజయదుర్గా టాటా ఏసీ స్టాండ్ సభ్యులు ఎస్.చిన్న, వి.రామారావు, వి.జనార్దన్ తెలిపారు.



ఎమ్మెల్సీ వంశీకృష్ణకు ఆహ్వాన పత్రం అందిస్తున్న శరన్నవరాత్రి వేడుకల కమిటీ సభ్యులు

శరన్నవరాత్రి వేడుకలకు ఆహ్వానం

శరన్నవరాత్రి వేడుకలకు హాజరు కావాలంటూ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌కు శ్రీవిజయ దుర్గాదేవి ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వానం పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు రాజు, నాగభూషణం, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన



వృద్ధురాలిని పలకరించి మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ పదో వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలసి ఆదర్శనగర్‌లో ఆయన ఇంటింటికి వెళ్లారు. వృద్ధులు, యువకులను పలకరించారు. వారితో మాట్లాడి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల ద్వారా ఎంతెంత లబ్ధి పొందారో ఆరా తీశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.